క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి జ్యేష్ట మాసం బహుళ ఏకాదశి శనివారం సందర్భంగా పంచామృతాభిషేకం పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో స్వామివారికి తులసిదళాలతో విశేష, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పంట మార్పిడితో భూసార పరిరక్షణ


శిక్షణ తరగతులలో పాల్గొన్న సహకార సంఘాల ప్రతినిధులు

రాజానగరం: పంటల మార్పిడి విధానాన్ని అవలంబించి సాగు చేయడం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతోపాటు మంచి దిగుబడులు పొందవచ్చని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో శనివారం 'భూసారం పెంపుదలకు పంట మార్పిడి' అనే అంశంపై అవగాహన కలిగించారు. వివిధ రకాల పంటలకు ఎరువులను ఏవిధంగా వాడాలి, సేంద్రియ ఎరువుల వర్గీకరణ వంటి వాటిపై మరో శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ


నగర కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి అదనపు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో చార్జ్ తీసుకున్నారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖపట్నం బదిలీ అయిన విషయం విదితమే. ఈ మేరకు నూతన కమీషనర్ వచ్చే వరకు కలెక్టర్ ప్రశాంతి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంసీ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

రైతుల ధాన్యం డబ్బులేవీ?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు



కడియం: ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ బీరాలు పలికారని, ఇప్పటి వరకు 960 గంటలైనా రైతులకు డబ్బులు అందలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. శనివారం ఆయన కడియంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 100 మందికి పైగా రైతులకు రూ.2.50 కోట్ల సొమ్ము అందాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ముందుకు వెళ్లాలంటే గత పంట సొమ్ము చేతిలో ఉంటే రైతులు పెట్టుబడులకు ఆసరాగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సీలింగ్ పెట్టడంతో కళ్లాల్లో ధాన్యంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసారని గిరజాల గుర్తు చేసారు. గత దాళ్వా సీజనల్‌లో కేవలం 48 మందికి మాత్రమే పంటల బీమాను ప్రభుత్వం చెల్లించిందన్నారు. కడియం ఆవలో ముంపు ప్రమాదం అంచున వేలాది ఎకరాల భూమి ఉందన్నారు. పంటల బీమా పథకం సక్రమంగా అమలు చేస్తే నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తొలకరి సీజన్‌కు సంబంధించి బీమా పథకాన్ని అరకొరగానే చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆయన అన్నారు. రైతులందరి పేరిట పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేసారు. బోర్ల ద్వారా వ్యవసాయం చేసుకునే మెరక రైతులకు నీటితీరువా వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని గిరజాల ప్రశ్నించారు. రైతులకు ఎన్నో సేవలందించే ఆర్‌బీకేలను గత ప్రభుత్వానికి పేరు వస్తుందన్న అక్కసుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రైతులను చిన్నచూపు చూస్తోందని గిరజాల బాబు అన్నారు.

ప్లాట్లు.. పాట్లు

- సాగు భూమి కనుమరుగు
- 516ఈ జాతీయ రహదారికి ఇరువైపులా రియల్ ఎస్టేట్ వెంచర్లు
- జన నివాసాలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న లే అవుట్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఉద్యాన పంటలకు రియల్ గండం


కోరుకొండ మండలంలో ఖాళీగా దర్శనమిస్తున్న లే అవుట్

కోరుకొండ: మధ్య తరగతి ప్రజలు, చిరుద్యోగులు సొంతిల్లు కోసం కలలు కంటారు. తక్కువ ధరకు లభిస్తాయని పట్టణానికి శివారు ప్రాంతాల్లో ఒక స్థలం కొనుగోలు చేసుకుని మంచి ఇల్లు నిర్మించుని ప్రశాంతమైన జీవనాన్ని సాగించాలన్న ఉద్దేశ్యంతో స్థలాలు కొంటారు. కొంతమంది పిల్లల చదువుకు, వివాహానికి అక్కరకు వస్తుందని రియల్ ఎస్టేట్ స్థలాల్లో పెట్టుబడి పెడతారు. నగర విస్తరణలో భాగంగా శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న ఆలోచనతో చాలామంది లే అవుట్లు, వెంచర్లలో స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. ఏళ్లు గడిచినా అవి నివాసయోగ్యంగా లేకపోవడంతో నిర్మానుష్యమైన ప్రాంతాలుగా మిగిలిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తృతంగా పెరిగిన సందర్భంలో వేసిన అనేక లే అవుట్లు నేటికీ జనావాసాలుగా రూపుదాల్చలేదు.

వ్యవసాయంలో నష్టాలతో భూముల అమ్మకం

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్నా చాలా లే అవుట్లు జన నివాసాలుగా అభివృద్ధి చెందలేదు. కోరుకొండ మండలం పరిధిలోని గ్రామాల్లో వేసిన అనేక లే అవుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టలేదు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు సాగులో నష్టాలను భరించలేక రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తమ మెరక భూములను తక్కువ ధరకు విక్రయించారు. నియోజకవర్గంలోని రాజానగరం జాతీయ రహదారి, కోరుకొండ- మారేడుమిల్లి వెళ్లే జాతీయ రహదారి 516 ఈ జాతీయరహదారి, రాజమహేంద్రవరం-సీతానగరం రహదారులను ఆనుకొని ఉన్న వేలాది ఎకరాల భూములు లే అవుట్లుగా మారాయి. ఇవన్నీ నేడు అసాంఘిక కార్యకలాలకు అడ్డాగా మారాయి.

నివాసాలు లేని నిర్మానుష్య ప్రాంతాలు

రియల్ ఎస్టేట్ స్థలాల్లో ప్రజలు నివాసం ఉంటున్నవి చాలా తక్కువగా ఉన్నాయి. అన్నీ ఖాళీ ప్రదేశాలుగా మిగిలాయి. లే అవుట్లలో ఎక్కడా గృహాలు లేకపోవడంతో ఖాళీ ప్రదేశాలుగా దర్శనమిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు, గంజాయి విక్రయాలకు నిలయాలుగా మారాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో విశాఖ జిల్లా చింతపల్లి, పాడేరు ప్రాంతం నుంచి వెంట తెచ్చుకున్న 2 కేజీల గంజాయిని చుట్టూ ప్రహరీ ఉన్న లే అవుట్‌లో పంచుకుంటుండగా ఐదుగురు యువకులు పోలీసులకు పట్టుపడ్డారు. యువకులు గంజాయిని తీసుకెళ్లేందుకు అనువుగా లే అవుట్ ప్రాంతాలను అడ్డాగా చేసుకుంటున్నారు. ఈ ఖాళీ లేఅవుట్లలో రాత్రివేళల్లో కొందరు మద్యం తాగడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఖాళీ లే అవుట్లలో మద్యం, గంజాయి బ్యాచ్ మధ్య దాడులు పెరిగి అవి హత్యలకు దారితీస్తున్నాయి. కోరుకొండ మండలం గాడాల లే అవుట్‌లో వెంకటనగరానికి చెందిన చిన్నబ్బులు హత్య జరిగిన సంగతి తెలిసిందే.


కనీస సౌకర్యాలు లేని రియల్ ఎస్టేట్ లే అవుట్

వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపాధి కరవు

రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లోని రియల్ ఎస్టేట్ భూములన్నీ ఖాళీగా ఉన్నాయి. రాజానగరం నియోజకవర్గంలో 35 శాతం భూములు లేఅవుట్లుగా మారాయి. వ్యవసాయసాగుకు అనుకూలమైన పంట పొలాలు లే అవుట్లు మారడంతో పంటల సాగు తగ్గిపోయింది. వ్యవసాయంపై ఆధార పడిన వారికి పని కరువైంది. పండ్ల తోటలతో కూడిన ఉద్యానవనాలు కూడా కనుమరుగవుతున్నాయి. రైతాంగానికి ఆదాయ వనరు లేకుండా పోయింది.

నందనవనాలుగా ఆకర్షించి.. ఆనక ఏమీ లేకుండా

రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లను ప్రారంభంలో నందనవనాలుగా తీర్చిదిద్ది, కొనుగోలుదారులను ఆకర్షించి స్థలాలను విక్రయించారు. మధురపూడిలోని విమానాశ్రయం నుంచి గోకవరం వెళ్లే రహదారికి ఇరువైపులా చాలా లే అవుట్లున్నాయి. మంచి లాభదాయకంగా ఉంటుందని ఆశించిన కొనుగోలుదారులకు కొంతకాలం తర్వాత నిరాశే మిగిలింది. దీంతో స్థలం అమ్ముడుపోక, పెట్టిన పెట్టుబడి తిరిగి రాక అప్పుల్లో కూరుకుపోయిన వారున్నారు. చాలామంది బ్యాంకు రుణాలతో స్థలాల కొనుగోలు చేసిన వారు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు.

పుట్టగొడుగుల్లా కచ్చా లే అవుట్లు

వ్యవసాయ భూములను కొందరు రియల్ ఎస్టేట్ పేరుతో నిబంధనలు పాటించకుండా ఎక్కడికక్కడ పుట్ట గొడుగుల్లా కచ్చా లే అవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కచ్చా లే అవుట్లు వేసి విక్రయిస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల అండదండలతో కచ్చా లేఅవుట్లు పెరుగుతున్నాయి. కచ్చా లే అవుట్లను నిలుపుదల చేయాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంట భూములను మినహాయించాలి



రియల్ ఎస్టేట్ లే అవుట్లకు పంట పొలాలు, పండ్ల తోటలను మినహాయించాలి. భవిష్యత్తు తరాలకు భూమి, ఆహారం, ఆదాయ వనరు కొరత ఏర్పడకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకోవాలి.రైతన్నలకు ప్రభుత్వాల ప్రోత్సాహం కరువై ఆర్థిక సమస్యలకు గురవుతున్నారు. దీంతో భూములను అమ్ముకుని వారు నిరుపేదలవుతున్నారు.

– నేతుల చిన్ని, ఉప సర్పంచ్, కోరుకొండ

పండ్ల తోటలను రక్షించాలి



మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని రైతులకు ఆదాయ వనరుగా ఉన్న పండ్ల తోటలను లే అవుట్లకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలి. మధురపూడి, నిడిగట్ల, బూరుగుపూడి, గుమ్ములూరు, జంభూపట్నం, నర్సాపురం, గాదరాడలో మామిడి, జీడిమామిడి, నేరేడు, పనస, బత్తాయి, జామ, నిమ్మ, బొప్పాయి తోటల రక్షణకు అధికారులు కృషి చేయాలి.

– బాసా సత్యనారాయణ, రైతు, గాదాల

జీజీయూలో ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోటేశ్వరరావు

రాజానగరం: పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్రను పోషిస్తున్న హైడ్రోగ్రఫీ, ఓషనోగ్రఫీ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఆయా రంగాల్లో అపార ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ పి.వెంకట కోటేశ్వరరావు అన్నారు. జీజీయూలో సివిల్, మైనింగ్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం జరిగింది. హైడ్రోగ్రఫీ, సముద్ర శాస్త్రాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైనింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ వై.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సముద్ర వనరులను సమృద్ధిగా వినియోగించుకోవడంపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి సూక్తులు ఆచరించాలి

రంగంపేట: షిరిడీసాయి, సత్యసాయి సూక్తులు ఆచరించి, జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సత్యసాయి వ్రత సహస్రావధాని యడవల్లి రఘుపతి అన్నారు. శనివారం ఈలకొలను గ్రామంలో సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో సామూహిక సత్యసాయి వ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన, ప్రశాంతి పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సమకూర్చిన మూడు చక్రాల రిక్షాను, ఇద్దరు మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు.

నిబద్ధత కలిగిన కార్యకర్త శివానందరెడ్డి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


శివానందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


సత్తి శివానందరెడ్డి (ఫైల్)

అనపర్తి: రామవరం గ్రామంలోనే కాకుండా వైఎస్సార్ సీపీ అనపర్తిలో క్రియాశీలకంగా ఉండే సత్తి శివానందరెడ్డి ఆకస్మిక మృతి వారి కుటుంబ సభ్యులకే కాకుండా పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల వేమగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివానందరెడ్డి మృతి చెందారు వారి కుటుంబ సభ్యులను శనివారం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు, మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆదాడి చిన సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


చినకొండేపూడిలో మొక్క నాటుతున్న డ్వామా ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి రామ్ ప్రసాద్

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డ్వామా ఏపీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చినకొండేపూడి అమృత్ సరోవర్ చెరువు వద్ద మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఎంపీడీవో ఎమ్ భారతి, ఏపీవో సత్యవతి తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు

యజ్ఞంలా మొక్కలు నాటాలి


బిక్కవోలులో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పెదపూడి: వాతావరణంలో సమతుల్యత సాధించడానికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మందపల్లి చిన్ని, గ్రామ నాయకులు తిబిరిశెట్టి ఆదినారాయణ, పలివెల బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద మూడో శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అలాగే కార్యాలయాన్ని శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ మంచినీరు వృథా చేయరాదన్నారు. భవిష్యత్తు తరాలకు ప్రకృతి ఇస్తున్న వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

బిక్కవోలు: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బిక్కవోలులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. తహసీల్దార్ కృష్ణ, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంపరలో మొక్క నాటుతున్న ముక్తేశ్వరరావు తదితరులు

మానసిక ప్రశాంతతకు యోగా సాధన దోహదం

- నన్నయ యూనివర్సిటీ, కళాశాలల్లో యోగా కార్యక్రమాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


జీఎస్ఎల్ వైద్య కళాశాలలో యోగా సాధన

రాజానగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నియోజకవర్గంలో శనివారం ఒక వేడుకగా నిర్వహించారు. ఆదికవి నన్నయ, జీజీయూ యూనివర్సిటీలతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లో యోగా సాధన చేశారు. వైస్ చాన్సలర్ ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో యోగాంధ్ర కార్యక్రమంలో 18,662 మంది విద్యార్థులు సమోదయ్యారని అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల, గైట్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా ఫిజియోథెరపీ రెండో సంవత్సరంలో యోగను ఒక సబ్జెక్టుగా చేరుస్తూ నేషనల్ ఫిజియోథెరపీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపూడి: అందరూ యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం అధికారులు యోగా సాధన చేశారు. తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తేతలి సుమ, తహసీల్దార్ బి.ఎస్ వీవీ కృష్ణ,ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. పందలపాక, కొంకుదురు ఉన్నత పాఠశాల, మండలలోని అన్ని సచివాలయాల వద్ద యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

యోగా సాధనతో ఒత్తిడి దూరం

కోరుకొండ: యోగా సాధనతో ఒత్తిడిని జయించవచ్చని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం కోరుకొండ శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తులతోపాటు ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చిట్టిబాబు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా టీచర్ సనపల ప్రసూన అధ్యాపకులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సీతానగరం మండలం పరిధిలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగాసనాలపై శిక్షణనిచ్చారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సీతానగరం: చినకొండేపూడి ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు నోట్స్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వీరబాబు ప్రధానోపాధ్యాయుడు జి.పాపారావు సమక్షంలో ఒక్కొక్క విద్యార్థికి నాలుగు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం కోసం విద్యాసామగ్రి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సొపాటి రూప, నాయకులు పలివెల నాగదేవి, నాగరాజు, చిట్టిస్వామి పాల్గొన్నారు


చినకొండేపూడి విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సీపీఐ ఎమ్ఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

ఆకుల వీర్రాజుకు పరామర్శలు


ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వీర్రాజు, తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును శనివారం పలువురు పరామర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ స్వర్గస్తులైన విషయం విదితమే. ఎమ్మెల్సీ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విశ్రాంత డీఆర్‌వో మారిశెట్టి జితేంద్ర తదితరులు ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, కాంగ్రెస్ పార్టీ రూరల్ కన్వీనర్ తాడాల కొండరాజు, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, శాప్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర నాయిబ్రహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, మాజీ కార్పోరేటర్ గుత్తుల మురళీధర్, గొర్రెల సురేష్, ఇన్నమూరి రాంబాబు, సిటీ, రూరల్ వైఎస్సార్ సీపీ నేతలు, నగర ప్రముఖులు వీర్రాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతం

కడియం: మండలంలోని నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతమని ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి మంత్రి బి.జనార్దన రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కడియపులంకలోని పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికిన రైతులు వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. వేలాది రకాలను స్థానికంగా అభివృద్ధి చేస్తున్న రైతుల నైపుణ్యాలను మంత్రి అభినందించారు.